

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కొత్తచెరువు

ఫ్యాప్టో శ్రీసత్యసాయి జిల్లా నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు హృదయరాజు తెలిపారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకులుగా జి.హృదయరాజు హాజరై ఎన్నిక నిర్వహించారు. ఫ్యాప్టో శ్రీసత్యసాయి జిల్లా ఛైర్మన్‌గా ఎపిటిఎఫ్ కోడూరు శ్రీనివాసులు, సెక్రటరీ జనరల్‌గా జి.రామకృష్ణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా యుటిఎఫ్ కె.నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా యుటిఎఫ్ ఎస్.జయచంద్రారెడ్డి, ఎస్‌టియు జి.రామ్మోహన్, ఎపిటిఎఫ్ 1938 బి.హరిప్రసాద్, కార్యదర్శులుగా హెచ్‌ఎంఎ సురేష్‌బాబు, ఆప్టా వెంకటనాయుడు, ఎపిఆర్‌ఇటిఏ బి.చెన్నయ్యలను ఎన్నుకన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు అశోక్‌కుమార్, ఫైరోజ్ అహ్మద్, బికె.ముత్యాలప్ప, పివి.మాధవ, సాయిశివ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేకువజామున విషాదం

◆ఎద్దుల బండిని ఢీకొన్న ఐచర్

◆అక్కడికక్కడే ఇద్దరు కూలీలు మృతి

◆అగళి ప్రధాన రోడ్డుపై ఘటన

ప్రజాశక్తి-రొళ్ల

వేకువజామున కూలీల ఇంట విషాద ఘటన చోటు చేసుకుంది. సొంత పనుల నిమిత్తం ఎద్దుల బండిలో బయటకు వెళ్లిన వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎద్దుల బండిలో వస్తున్న వీరిని వెనుక వైపు నుంచి ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎద్దుల బండిలో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు ఒక ఆవు కూడా మరణించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అగిళి మండలం నరసాంబూది పంచాయతీ కసాపురం గ్రామానికి చెందిన గోవిందప్ప(37), తిన్నేగౌడా(41), శివన్నలు శనివారం ఉదయం ఎద్దుల బండిలో పొలం వద్దకెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని రామన్నపల్లి నుంచి అగళి మీదుగా గ్రామానికి బయల్దేరారు. ఎద్దుల బండి అగళి హైవే వద్దకు రాగానే రొళ్ల నుంచి కర్నాటక వైపు వెళ్తున్న ఎపి39 టివి4235 ఐచర్ వాహనం వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఎద్దుల బండి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో గోవిందప్ప, తిన్నేగౌడలు తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇదే బండిలో ఉన్న ఎంపిటిసి గోవిందప్ప సోదరుడు శివన్న తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద ధాటికి ఓ ఆవు మృతి చెందింది. మరో ఆవు తీవ్రంగా గాయపడింది. ఘటనకు కారణమైన డ్రైవర్ ఐచర్ వాహనాన్ని రోడ్డుపై వదిలి పారిపోయాడు. ప్రమాద విషయం తెలియగానే సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108లో హిందూపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఐచర్ వాహనం ఢీకొనడంతో ముక్కలు ముక్కలు అయిన ఎద్దుల బండి

మృతుల కుటుంబానికి జెడ్పీటీసీ రూ.పదివేల సాయం

ప్రమాద విషయం తెలుసుకున్న అగళి జెడ్పీటీసీ ఉమేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు తనవంతుగా ఒక్కొక్కరికి రూ.10 వేల తక్షణ సాయం అందించారు. ఇటీవల అగళి హైవే రోడ్డుపై ప్రమాదాలు అధికం అయ్యాయని, వీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

‘జలకళకు విద్యుత్ కనెక్షన్ లేదు’

◆రైతులే దీన్ని భరించాలి

◆జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల వెల్లడి

◆పలు సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జగనన్న జలకళకు ఇక నుంచి విద్యుత్ కనెక్షన్, మోటర్ల ఏర్పాట్లను లబ్ధిదారులే చూసుకోవాలని ఇందుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని అధికారులు వెల్లడించారు. మొదటి దశ వేసిన జలకళకు మాత్రం విద్యుత్ కనెక్షన్, మీటర్లు వేస్తామని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశం హాలులో శనివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాచరణ్ శ్రీ, మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు హాజరయ్యారు. రెండు జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి సెల్వరాజన్, బసంత్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. కంబదూరు జడ్పిటిసి మాట్లాడుతూ జలకళ కింద బోర్లు వేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్లు ఇంతవరకు ఇవ్వలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ నాగలక్ష్మి స్పందిస్తూ జలకళకు సంబంధించి విద్యుత్ కనెక్షన్ మొదటి విడతలో వేసిన బోర్లకు మాత్రమే ఇస్తామన్నారు. ఆ తరువాత విడతలో కేవలం బోర్లు మాత్రమే వేస్తారని, కనెక్షన్‌ను రైతులే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆ రకంగా ప్రభుత్వ మార్గదర్శకాల్లో మార్పులు జరిగాయని వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా తప్పా ఇతర ఎరువులేవీ ఉండటం లేదని ఆమడగూరు జెడ్పీటీసీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అన్నింటినీ అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పుట్టపర్తి జెడ్పీటీసీ మాట్లాడుడుతూ సత్యసాయి జిల్లాలో ఉద్యానవన అధికారులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యానవన అధికారులు ఎందరున్నారో చెప్పాలని అధికారులను అడిగారు. దీనిపై ఉద్యానవన శాఖ ఎడి చంద్రశేఖర్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పరిధిలో మొత్తం పది మంది ఉద్యానవ అధికారుల పోస్టులు ఉన్నాయని, వీరిలో నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఒక్కో అధికారికి పది మండలాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేయిన్‌గన్‌లు, నీటి పైపులు ఎక్కడున్నాయో చెప్పాలని బెళుగుప్ప జెడ్పీటీసీ ప్రశ్నించారు. దీనిపై పదేపేద చర్చకు వస్తున్నా రికవరీ చేసే చర్యలు అధికారులు చేపట్టడం లేదని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిలు తెలిపారు. ఇందుకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ రెయిన్‌గన్‌లు ఎక్కడున్నాయన్న దానిపై నివేదిక రూపొందించామని, అందులో 20 నుంచి 30 శాతంలోపే పనిచేసే విధంగా ఉన్నాయన్నారు. వాటి రికవరీకి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గృహ నిర్మాణ అంశంపై కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ అనంతపరం జిల్లాలో 60 వేల ఇళ్ళు మంజూరయితే ఆరు వేలు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఉగాది నాటికి 20 వేల ఇళ్లు పూర్తి చేయాలన్నది లక్ష్యమని తెలిపారు. రెండు మాసాల వ్యవధిలో 14 వేల ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అందరి సహకారం అవసరం అవుతుందని చెప్పారు. అదే విధంగా 2024 నాటికి మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే కేంద్రమిచ్చిన నిధులు వెనక్కు వెళ్లే అవకాశాలున్నాయని, కావున లబ్ధిదారుల్లో అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించేందుకు ప్రయత్నించాలని సభ్యులను కోరారు. గృహ నిర్మాణ శాఖలో నిధుల కొరత లేదని అధికారులు సైతం చెబుతున్నారని, లేఅవుట్ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విధంగా అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ అంశంపై బుక్కరాయసముద్రం భాస్కర్ జెడ్పీటీసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలు పౌష్టికాహారం లోపాలు అదే విధంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం పౌష్టికాహారం ఇస్తున్నా ఎందుకు వారిలో ఆలోపాలు పోవడం లేదో పరిశీలించాలని కోరారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు పూర్తి సమయం విధుల్లో ఉండటం లేదని, చర్యల తీసుకోవాలని కోరారు. దీనికి సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ ఇప్పుడు ఉద్యోగులందరికీ పేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది కాబట్టి, ఇక నుంచి పూర్తి సమయంలో ఉద్యోగులు ఉండాల్సి వస్తుందని చెప్పారు. ఇలా పలువురు సభ్యులు సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

స్త్రీ,శిశుసంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీ చరణ్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. జెడ్పీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్య అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాడు-నేడు ద్వారా నూతన అంగన్ వాడీల నిర్మాణం, ఇప్పటికే ఉన్న అంగన్ వాడీ భవనాల మరమ్మతులు జరుగుతున్నాయని తెలిపారు. అద్దె గదుల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు అద్దె ఖర్చుల కోసం ఎక్కువ మొత్తం చెల్లించాలని నిర్ణయించినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ‘బాలామతం ప్లస్’ను రాష్ట్రంలోని ప్రతి పిల్లవాడికీ అందించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు తెలియజేశారు



హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో సర్వేనెంబర్ 626 ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను నిలిపివేసి హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు అక్రమ కట్టడాలను నిలిపివేయాలని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కమిషనర్ మల్లికార్జున, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, సబ్‌రిజిస్ట్రార్‌కు శనివారం అందజేశారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంబంధిత సర్వే నెంబర్‌లో అక్రమ కట్టడాలను నిరోధించాలని ఇప్పటికే స్పందన కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు హైకోర్టులో రిట్ పిటీషన్ వేయగా తక్షణమే అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో ధర్మవరంలో ఉన్న అధికారులందరూ వైఫల్యం చెందారని విమర్శించారు. తక్షణమే నిషేధిత జాబితాలో ఉన్న 626 సర్వే నెంబరులో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల ద్రోహి సిఎం జగన్ : టిడిపి



విలేఖరులతో మాట్లాడుతున్న టిడిపి ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాళ్ల శ్రీనివాసులు

ధర్మవరం టౌన్ : దళితులు, దళిత కాలనీలకు రావాల్సిన ఎస్సీ కార్పొరేషన్ నిధులను సిఎం జగన్ పక్కదారి పట్టించి దళిత ద్రోహిగా మిగిలిపోయారని టిడిపి ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశగాళ్ల శ్రీనివాసులు విమర్శించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2003లోనే ఎస్సీ నిధులను ఎస్సీలకే కేటాయించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ నిధులను ఇతర పథకాలను మళ్లించి ఎస్సీలను వంచిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకు ఏ సీఎం ఎస్సీల నిధులను పక్కదారి మళ్లించిన దాఖలాలు లేవన్నారు. చట్టప్రకారం ఎస్సీలకు రావాల్సిన నిధులను వారి పథకాలకే వినియోగించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్సీ సెల్ నాయకులు కాశప్ప, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మొండి శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గజ్జల సుబ్రమణ్యం, వరద, తదితరులు పాల్గొన్నారు.

రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ

తాడిమర్రి : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఎఒ రమాదేవి శనివారం రైతువాణి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు, ప్రజా సమస్యలపై రైతుసంఘం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, మండల నాయకులు పోతలయ్య, శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి తొలగిన అడ్డంకి..

బత్తలపల్లి : మండలంలోని సంఘమేశ్వరక్షేత్రం వద్ద రోడ్డు కమ్ చెక్ డ్యాం నిర్మాణానికి ఏర్పడిన అడ్డంకులు తొలగాయి. ఆర్డీటీ సంస్థ సహకారంతో రూ.1.39 కోట్లతో రోడ్డు కమ్ చెక్ డ్యాం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే బత్తలపల్లి మండలం నుంచి ధర్మవరం మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఓ రైతు తమ పొలంలో భూమి ఎక్కువ పోతోందని ఫిర్యాదు చేశాడు. దీంతో వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఆర్డీటీ సిబ్బంది రెవెన్యూ అధికారులతో కలిసి భూమిని సర్వే చేశారు. సంబంధిత భూమి అసైన్‌మెంట్ భూమి కావడంతో భూమి ఎక్కువగా పోతోందని వివరించడంతో రైతు అంగీకరించాడు. దీంతో అడ్డంకి తొలగినట్లయింది. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ అధికారులు మురళి, బాషా, గౌసు, సంగాల విఆర్‌డి సాకే ప్రసాద్, సర్వేయర్లు ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

10న వాహనాల వేలంపాట

తాడిమర్రి : మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 10వతేదీన ధర్మవరం ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు ధరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బత్తలపల్లి : మైనర్‌కు మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్న యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో ఉంటున్న మైనర్‌ను బుక్కపట్నం మండలం గసికవారిపల్లి గ్రామానికి చెందిన సుంకన్న కుమారుడు డేరంగుల విజయ్‌కుమార్ మాయమాటలు చెప్పి శారీరకంగా కలుసుకున్నాడు. బాలిక కర్నాటకలోని దొడ్డబళ్లాపూర్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. విజయ్‌కుమార్‌కు బాలిక చెల్లెలు వరుస అవుతుంది. ఈనేపథ్యంలో డిసెంబర్ 27వ తేదీన మైనర్‌ను బెంగళూరుకు తీసుకెళ్లిన విజయ్ తన వద్దనే ఉంచుకుని అత్యాచారం చేసినట్లు జనవరి 6న మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు నల్లచెరువు ఎస్ఐ వరలక్ష్మీదేవి బాలికను విచారించినట్లు తెలిపారు. ఆమె విచారణ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సౌకర్యాలు కల్పిస్తారా.. గుడ్‌విల్ వెనక్కిస్తారా..?

‘పురం’ వాణిజ్య సముదాయ వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయంలో వ్యాపారులు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని, లేనిపక్షంలో తాము చెల్లించిన గుడ్‌విల్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని వ్యాపారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షులు సూర్య నారాయణ, అధ్యక్షులు నిమ్మకాయల రాము, రహమాన్ మాట్లాడుతూ కరోనా కంటే ముందు 150 మంది వ్యాపారులు రూ.2లక్షల డొప్పును డిపాజిట్ చెల్లించారన్నారు. సంవత్సరాలు గడిస్తున్నా వాణిజ్య సముదాయంలో ఉన్న గదులను వేలం వేయకపోవడంతో చివరకు అధికారులపై చెల్లించిన డిపాజిట్ అయినా తమకు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తే గదులకు బహిరంగ వేలం వేశారన్నారు. వేలంపాట సమయంలో వాణిజ్య సముదాయంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోడంతోపాటు రెండు కిలోమీటర్లు తోపుడు బండ్లు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో వ్యాపారులు రూ.51లక్షల వరకు గుడ్‌విల్ చెల్లించి వేలంలో గదులను దక్కించుకున్నారన్నారు. గదులు తీసుకుని 7 నెలల గడుస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. దీంతో వ్యాపారులెవరూ వ్యాపారాలు ప్రారంభించలేదన్నారు. మున్సిపల్ అధికారులు అన్ని గదులకూ రూ.10 కోట్లు గుడ్‌విల్ నిర్ణయిస్తే వ్యాపారులందరకూ కలిపి బహిరంగ వేలం ద్వారా దాదాపు రూ.13కోట్లు చెల్లించారన్నారు. అధిక లాభాలు రావాడంతో మున్సిపల్ అధికారులు వాణిజ్య సముదాయంలో ఏం జరుగుతోందో చూడటం లేదన్నారు. వ్యాపారులు ప్రారంభించకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయిందన్నారు. దీంతోపాటు మట్కా, జూదం, వ్యభిచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న తోపుడు బండ్ల వ్యాపారాలను ఖాళీ చేయించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము చెల్లించిన గుడ్‌విల్‌ను తిరిగి ఇవ్వాలన్నారు. అలాగని ఏమీ చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరన్యమని వాపోయారు. ఈ సమావేశంలో వ్యాపారులు వినయ్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వ్యాపారుల సంఘం నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న జామియా మసీదు ముతవల్లి ముస్తాక్ అహ్మద్

కబరస్తాన్ పునర్‌నిర్మాణం పవిత్రకార్యం

రాజకీయ నాయకులు సంయమనం పాటించాలి - ముస్లిం మతపెద్దలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న కబరస్తాన్ పునర్ నిర్మాణం పవిత్ర కార్యమని జామియా మసీదు ముతవల్లి ముస్తాక్‌అహ్మద్, మదీనా మసీదు ముతవల్లి జాకీర్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు స్టార్ ఖలీల్ అన్నారు. శనివారం స్థానిక పీఆర్టీ వీధిలో ఉన్న షాదీమహల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల కబరస్తాన్ విషయంలో రాజకీయ నాయకుల జోక్యం చేసుకోవడం చాలా బాధ కలిగించిందన్నారు. ఎంతో పురాతనమైన కబరస్తాన్‌లో 8ఏళ్లుగా మురుగు నీటి సమస్య కారణంగా సమాధులు నీటిఊటతో శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. నీటి నివారణకు ఎన్నో ప్రత్యామ్నాయాలు చేసినా ఫలితం లేదన్నారు. చివరకు కబరస్తాన్‌లోకి వెళ్లాలన్నా బురదమయమై ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 40 మసీదుల మతవల్లిల ఆమోదంతో కబరస్తాన్ పునర్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇది పూర్తిగా ముస్లింల అంతర్గత వ్యవహారమన్నారు. ఇందులో రాజకీయ పార్టీల నాయకులు చొరబడి ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. మతసామరస్యంలో ఎంతో ఆదర్శంగా ఉన్న ముస్లింల ఐక్యతకు భంగం వాటిల్లే విధంగా ఎవరూ వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు ఎస్పీ బాషా, చాంద్‌బాషా, సుభాన్, ఇర్ఫాన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు సరికాదు

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వ్యవసాయ పంపుసెట్లుకు మీటర్ల బిగింపును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలని అఖిలపక్ష నాయకుల డిమాండ్ చేశారు. వ్యవసాయ పంపుసెట్లుకు మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు ప్రభుత్వాలమని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై భారం మోపేందుకు ఏవిధంగా పంపుసెట్లుకు మీటర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నల్లచట్టాల్లో భాగమే పంపుసెట్లకు మీటర్ల బిగింపు అన్నారు. ఇదే జరిగితే రైతాంగం పూర్తిగా నాశనం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి సిఎం జగన్ మీటర్లు బిగించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జగన్ రైతుల గురించి చెప్పేవన్నీ శ్రీరంగనీతులేనని.. చేసేపనులు మాత్రం రైతుల నోట్లో మట్టికొట్టే పనులు చేస్తున్నాడని మండిపడ్డారు. గారడీమాటలతో రైతులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులే బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వ్యవసాయ పంపుసెట్లుకు మీటర్లు బిగించే ప్రయత్నం విరమించుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, టిడిపి జిల్లా నాయకులు పురుషోత్తంగౌడ్, భీమినేని ప్రసాద్‌నాయుడు, చీమల రామాంజి, ఎపి రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, గంగాధర్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్పయాదవ్, ఎన్ఎస్ఎయూఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, రైతుసంఘం నాయకులు మారుతి, శ్రీరాములు, ఎన్ఎస్‌యుఐ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

లబ్ధిదారులకు సిమెంట్ పంపిణీ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలో వెంగమ్మ చెరువు కు చెందిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అధికారులు, నాయకులు సిమెంట్ను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నరసారెడ్డి, హౌసింగ్ ఎఇ ఖజామొహిద్దీన్, వర్క్ ఇన్ స్పెక్టర్ బాబయ్య, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అత్తార్చాంద్బాషా, తదితరులు

కదిరి అర్బన్ : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన 2023 క్యాలెండర్ను స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్చాంద్బాషా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న ప్రజాశక్తి దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బయప్ప, హరి, బాలచందర్, ఆనంద్, ప్రసాద్, సూర్యనారాయణ, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బికె సేవలు సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్ : రైతు భరోసా కేంద్రం నుంచి అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ వీరనరేష్ కోరారు. మండలపరిధిలోని బుల్లసముద్రం గ్రామ ఆర్బికెను ఆయన శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఫర్టిలైజర్ లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్అదాలత్

కదిరి టౌన్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సిఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సీనియర్ సివిల్ జడ్జి ఛాంబర్లో శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్లో అధిక సంఖ్యలో క్రిమినల్ కేసులు రాజీ చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుందరి, డీఎస్పీ భవ్య కిషోర్తో పాటు పలువురు సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

మడకశిర రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ మాధుర్య కోరారు. మండల పరిధిలోని కొడిగేపల్లిలో 104ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంప్ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శేషు, ఎంఎల్హెచ్పి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించండి


సమావేశంలో మాట్లాడుతున్న రొద్దం ఎంపిపి

రొద్దం : మండల కేంద్రంలో అర్థాంతరంగా ఆగిన ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఎంపిపి చంద్రశేఖర్ జెడ్పీ ఛైర్పర్సన్, కలెక్టర్ను కోరారు. శనివారం అనంతపురంలో జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ ఆసుపత్రి భవన నిర్మాణ సమస్యను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. కరూ. 1.65 లక్షలతో చేపట్టిన 20 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. స్పందించిన ఛైర్పర్సన్ భవన నిర్మాణపనులు వేగవంతం చేయించాలని డిఎంహెచ్ఒకు ఆదేశించినట్లు ఎంపిపి తెలిపారు.

పింఛన్లు పంపిణీ

గాండ్లపెంట : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అంజినప్ప, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపిపి గంగోజమ్మ, వైసిపి నాయకులు భాస్కర్ రెడ్డి, రహమతుల్లా, రవీంద్ర నాయక్, శంకర నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వ్యక్తిగత కార్యదర్శిగా కదిరి డిపో కండెక్టర్

కదిరి టౌన్ : కదిరి ఆర్టీసీ డిపో పరిధిలో కండక్టరుగా విధులు నిర్వహిస్తున్న ఆర్.జయరామిరెడ్డిని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్కు వ్యక్తిగత కార్యదర్శిగా నియమిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ నుండి ఉత్తర్వులు అందాయి. జయరామి రెడ్డి 2009 నుండి కదిరి డిపోలో పనిచేస్తున్నాడు. జయరామి రెడ్డిని ఎమ్మెల్సీ వ్యక్తగత కార్యదర్శిగా నియమించడంతో కదిరిడిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులు హరిమోహన్, ఎన్.వి.రమణ, బైరిశెట్టి, రామక్రిష్ణ, ఉత్తన్న, పులి శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, నారాయణస్వామి, బాలరాజు, అబ్బాస్ తదితరులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బుక్కపట్నం : ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు అండర్ 17, 21 సీనియర్, జూనియర్ విభాగాలలో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎన్నికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివద్ధి అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలు బుక్కపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న ఉంటుందని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు తమ ఆధార్ కార్డుతో పి ప్రసాద్ సెల్ నెంబర్ : 9573065966 ను సంప్రదించాలని కోరారు.

బాబాయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

హిందూపురం : హిందూపురం మున్సిపల్ ఛైర్పర్సన్ ఇంద్రజ శనివారం పెనుకొండ బాబాయ్య దర్గాను సందర్శించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ మున్సిపల్ ఛైర్మన్ ఉమర్ ఫారూఖ్, కౌన్సిలర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ మేళా

పెనుకొండ : బాబా ఫకద్దీన్ ఉరుసు సందర్భంగా మండలంలోని ప్రజల సౌకర్యార్థం పోస్టల్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ మేళా నిర్వహించనున్నట్లు పోస్టల్ పెనుకొండ సబ్ డివిజన్ అధికారి వినయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సోమవారం, మంగళవారం రెండు రోజులు పాటు పోస్టల్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. కేవలం రూ399ల ప్రీమియం కడితే రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పించబడుతుందన్నారు.

'చిత్రావతి'లో ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు


రోడ్డుపై బైటాయించిన రైతులు, గ్రామస్తులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చిత్రావతి నది నుంచి ఇసుక తీసుకెళుతున్న టిప్పర్ను రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రాయలవారిపల్లి సమీపంలో చిత్రావతి నది నుంచి ఇసుక తీసుకెళుతున్న వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వంతెనకు 50 మీటర్ల దూరంలో తవ్వకాలకు అనుమతులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా వాటిని ఉల్లంఘించి ఇసుకను తోడేస్తున్నారన్నారు. దీంతో వరదలు వచ్చినప్పుడు వంతెన కొట్టుకుపోతోందనాన్రు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తవ్వకాలు నిలుపుదల చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చొన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ నవీన్ కుమార్, ఎస్ఐ బాబ్జాన్ అక్కడికి చేరుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు, గ్రామస్తులు శాంతించారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు


సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

ప్రజాశక్తి -పెనుకొండ

స్థానిక పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగపు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో విద్యార్థులు అధ్యాపకులతో కలిసి భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నృత్యాలు, గాలిపటాలు ఎగరవేయడం కళాశాల ఆవరణంలోని చెట్లకు ఊయలను వేసి ఊగడం లాంటి సాంప్రదాయ క్రీడలు ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ రెడ్డి మాట్లాడుతూ ముందస్తు సంక్రాంతి పండుగను కళాశాలలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయప్ప, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ కె. శ్రీదేవి, అధ్యాపకులు ప్రతాప్, కళావతి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి విద్యాసంస్థలలో ... ప్రగతి, గ్లోబల్ జైన్ విద్యాసంస్థలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ యు.శ్రీనివాసులు, కరస్పాండెంట్ మంజువాణి సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అభివృద్ధి పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

గాండ్లపెంట : మండల పరిధిలోని కోటూరు కరణం వారి పల్లి, కుమ్మరవాండ్లపల్లి, అడ మరకవారిపల్లి తదితర గ్రామాలలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పాల్గొన్నారు ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీ భారతి, సర్పంచులు కళావతి రవీంద్ర నాయక్, చలపతి, ప్రతాప్ రెడ్డితో పాటు నాయకులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల కేంద్రంలో ఎమ్మెల్యే నిధులతో చేపట్టిన ప్రభుత్వ కమిటీ భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంకర్నారాయణ శనివారం ప్రారంబించారు. మండల కేంద్రంలోని బోయపేట కురుబ కాలనీ. పాత ఎస్సీ కాలనీలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్తో పాటు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె, తదితరులు

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో సామాన్యులు బ్రతకలేని పరిస్థితి ఏర్పడిందని ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, నాయకులు సామకోటి ఆదినారాయణ, దయ్యాల ఉమాపతి, రాజప్ప, గంగాద్రి, జయప్రకాష్, బేకరీ నాయుడు, మాల మనోహర్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మడకశిర: రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. శనివారం స్థానికనగర పంచాయతీలో మూడవ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని టిడిపి పట్టణ అధ్యక్షులు మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, కౌన్సిలర్ నరసింహ రాజు, నాయకులు లక్ష్మీనారాయణ, నాగరాజు, శ్రీనివాసులు, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రారంభించనున్న పాదయాత్రకు భయపడే వైసిపి ప్రభుత్వం జీవో 1 ను ఇచ్చిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయనీకకుండా వైసిపి ప్రభుత్వం అనేక కుయుక్తులు పన్నుతోందన్నారు. ఈ ప్రభుత్వానికి జీవోలంటే కామెడీ గా వుందన్నారు. వైసిపి పాలనతో ప్రజలు విసుగు చెందారని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు.

ఆగిన '108' సేవలు



మరమ్మతుకు గురైన 108 వాహనం

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో వైద్య సేవల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 108 వాహనం మరమ్మతులకు గురైంది. శ్రీ సత్య సాయి జిల్లా అమడుగూరు మండలానికి చెందిన 108 వాహనం నల్లమాడ మండలం వంకర కుంట గ్రామానికి చెందిన ఒక రోగిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలిస్తూ మార్గమధ్యంలో టైరు పగిలి ఆగిపోయింది. మరొక 108 వాహనాన్ని పుట్టపర్తి నుంచి రప్పించి రోగిని కదిరికి తరలించారు. ప్రస్తుతం అమడగూరు మండలానికి చెందిన 108 వాహనం ఓడి చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండిపోయింది. దీంతో ఓడి చెరువు, అమడగూరు మండలాలకు ఒకే వాహనాన్ని వినియోగించవలసిన పరిస్థితి నెలకొనడంతో ప్రజలు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబందిత అధికారులు స్పందించి 108 వాహనానికి కొత్త టైర్లు, ఇతర మరమ్మతులు పూర్తి చేసి, వాహనాన్ని వైద్య సేవలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలోని రాజేంద్రనగర్లో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజేంద్రనగర్కు చెందిన పొన్నూరు పురుషోత్తం (41) బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగించేవాడు. అయితే కుటుంబ అవసరాల నిమిత్తం రూ.6లక్షల వరకూ అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యేవాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుషోత్తం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతసేపటికి ఇంటికి వచ్చిన భార్య మాలతి ఉరికి వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. వెంటనే స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలను భార్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఓబులదేవరచెరువు : మండలంలోని కొండకమర్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లమాడకు చెందిన అంజనేయులు అనే యువకుడు గాయపడ్డాడు. కొండకమర్ల నుంచి నల్లమాడకు ద్విచక్రవాహనం వెళ్తుండగా మార్గమధ్యంలో గొర్రెలు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని 108 ద్వారా నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్లు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

హిందూపురం : హిందూపురం పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా పలు కల్లు దుకాణాలపై విజయవాడకు చెందిన ఎక్సైజ్, విజిలెన్స్ సిఐలు రెండు బృందాలుగా ఏర్పడి శనివారం దాడులు నిర్వహించారు. పరిశీలన నిమిత్తం అన్ని దుకాణాల్లో శాంపుల్స్ సేకరించారు. ప్రజా సంఘాల వారు ఆందోళనలు చేస్తే విజిలెన్స్ అధికారులు తనఖీలు నిర్వహించారని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ స్పందించి కల్తీ కల్లు దుకాణాలకు దాడులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అయితే నిజంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొంత మంది అధికార పార్టీకి చెందిన వారు కల్తీ కల్లు అమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకుని, నిజమైన కల్లుగీత కార్మికులకు న్యాయం చేసి, కల్తీ కల్లును నివారించాలని కోరారు.

మత్తుమందుకు దూరంగా ఉండాలి

హిందూపురం : యువత మత్తు మందుకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సెబ్ సిఐ లక్ష్మిదుర్గయ్య కోరారు. శనివారం పట్టణంలోని బాలయేసు కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజం- సంక్షేమానికి సంకేతం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సిఐ లక్ష్మిదుర్గయ్య మాట్లాడుతు యువత డ్రగ్స్కు దూరంగా ఉండి జీవితాన్ని ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు శౌరి రెడ్డి, సెబ్ సబ్ ఇన్స్పెక్టర్ పోతులయ్య, సిబ్బంది రామ మోహన రెడ్డి, పోగ్రాం అధికారులు అశ్వర్థ నారాయణ, రఘు, రమేష్, హరీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం

పెనుకొండ : విద్యతో పాటు క్రీడలు అవసరమని క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్, డీఎస్పీ హుస్సేన్ పీరా పేర్కొన్నారు. పట్టణంలోని దర్గా పేటలో బాబయ్య స్వామి దర్గా ఉరుసు సందర్భంగా దర్గా పీఠాదిపతి తాజ్ బాబా, కాబోయే వంశపారంపర్య దర్గా పీఠాదిపతి సలావుద్దీన్ ఆధ్వర్యంలో పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సబ్ కలెక్టర్, డీఎస్పీ బాబాఫకద్దీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ను సలావుద్దీన్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు తిమ్మారెడ్డి, ఇలియాజ్, ధనుంజ రెడ్డి తో పాటు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

హిందూపురం : విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని మున్సిపల్ వైస్ఛైర్మన్ బలరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సప్తగిరి కళాశాలలో ఎంబిఎ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ఛైర్మన్ బలరామిరెడ్డి, దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ పరిగి వేణుగోపాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విద్యార్థులు పర్సనాలిటీ డెవలప్మెంట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకున్నట్లయితే ఉద్యోగ అవకాశాలు అపారంగా లభిస్తాయన్నారు. మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికలు వేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యంగ్ మేనేజర్ బి-క్విజ్, ఆడ్ మేకింగ్, వివిధ రకాల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివ శంకర్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం తగ్గుతోందా.. ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ప్రకటించింది. ఇదే తమ మ్యానిపెస్టో అని కూడా ప్రకటించింది. దీని ప్రకారం పాలన సాగుతుందని చెప్పింది. అయితే ఈ సంక్షేమ పథకాలు అమలులో ముందున్నంత ఊపు కనిపించడం లేదు. నిలువ నీడలేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పింది. అయితే ఆచరణలో మూడున్నరేళ్లలో పూర్తయినా ఇళ్ల నిర్మాణాలు మొక్కుబడే అని చెప్పాలి. ఇళ్ల స్థలాల కేటాయింపులోనే తీరని జాప్యం జరుగుతూ వచ్చింది. అన్ని అవరోధాలు అధిగమించి 2021 జూలైలో జగనన్న ఇళ్లపేరుతో పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు కేటాయించే కార్యక్రమం చేపట్టింది. వెంటనే ఇళ్ల నిర్మించి, 2022 నాటికి ఉగాదికే ఇళ్లు ఇస్తామని చెప్పింది. అయితే ఆచరణలో అమలు జరగలేదు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు ముందుకు పడటం లేదు. లక్ష్యంలో కనీసం పదో వంతు కూడా పూర్తవలేదు. అనంతపురం జిల్లా వరకు చూస్తే మొత్తం 64463 ఇళ్లు మంజూరయితే కట్టింది కేవలం 5908 మాత్రమే. ఇంకా 53895 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో 41940 ఇళ్లు మంజూరయితే 7788 పూర్తయ్యాయి. తక్కిన ఇళ్లన్నీ అరకొరగానే ఉన్నాయి. ఇంతలోనే ప్రభుత్వం ఈ ఉగాది నాటికి జిల్లాకు 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఇది ఆచరణ సాధ్యమవుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అంటే ఈ ఏడాది ఉగాది మార్చి 22వ తేది అంటే 73 రోజులు ఉన్నాయి. ఈలోపు దాదాపు 25 వేల ఇళ్ల నిర్మాణాలు రెండు జిల్లాల్లో కలిపి పూర్తి చేయాల్సుంది. ఇది ఎంతవరకు సాధ్యమన్నది చూడాల్సి ఉంది. ఇంతలోనే అసలు సమస్య కూడా ముందుకోస్తోందని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు. ఒకటిన్నర సంవత్సరంగా ఇళ్ల నిర్మాణాలకు మంజూరై పనులు సాగలేదు. ఈ నిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది. ఇళ్లు పూర్తికాకపోతే కేంద్రం నిధులు 2024 మార్చికి వెనక్కు తీసుకుంటుందని హెచ్చరిస్తున్నారు. అంటే ఈ ఏడాది పూర్తి చేయలేకపోతే సమస్య మరింత ఇబ్బందికరంగా మారనుందని ఆందోళన సైతం వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే నవరత్నాల్లో మరో రత్నం అయిన పింఛన్లకు కోతలు పెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. జనవరి మొదటనే 20 వేల పింఛన్లకు ఎసరు పెట్టే ఆలోచన చేసిందన్న ఆరోపణలున్నాయి. అయితే చివరి నిమిషంలో ఇది మారినప్పటికీ రాబోయే రోజుల్లో ఉంటుందన్న ప్రచారం మాత్రం సాగుతూనే ఉంది. దీని తరువాత జలకళ రైతులకు ఉచితంగా బోర్లు, విద్యుత్ మీటర్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడతకు మంజూరు చేసినట్లు చేసి రెండో విడతకు వచ్చే సరికి విద్యుత్ కనెక్షన్, మోటర్లకు కోత పెట్టింది. అయ్యే ఖర్చులో విద్యుత్ కనెక్షన్, మోటర్లకే అధికంగా ఖర్చు అవుతుందని లబ్దిదారులు చెబుతున్నారు. మొదటి విడతలో అనంతపురం జిల్లాలో 1475 బోర్లు తవ్వారు. సత్యసాయి జిల్లాలో 495 తవ్వారు. ఇప్పుడు లబ్దిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలా సంక్షేమ పథకాలకు కోతలు పడుతుపోతుండటం గమనార్హం. ప్రభుత్వం ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో కోతలు మాత్రం పెడుతూనే ఉంది.

